

వెనుగుమట్లలో ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# జాలిపడితే గోసపడుతరు

- సెంటిమెంట్ మాటలకు లొంగి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమే
- ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు
- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- ధర్మపురి అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్
- గొల్లపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర

గొల్లపల్లి, నవంబర్ 15: 'అయ్యే ఇప్పటికే రెండు మూడు సార్లు ఓడిపోయిండు. చిరిగిన బట్టలతో వస్తుండు. కంటతడి పెట్టుకుంటున్నడని కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ, మీ పిల్లల బంగారు భవిష్యత్ బుగ్గిపాలు చేసుకున్నట్లే. బతుకులు ఆగం చేసుకున్నట్లే. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమమని' ధర్మపురి అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు సూచించారు. శనివారం గొల్లపల్లి మండలం వెనుగుమట్ల, గోవిందపల్లి, చిల్వాకోడూర్, భీమ్‌రాజ్‌పల్లి, దట్నూర్, చెందోలి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టగా, అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెనుగుమట్ల బస్టాండ్‌వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి గ్రామంలో పాదయాత్రగా ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ మనకంటే ముందు ఏండ్ల పాటు కాంగ్రెసోల్లే అధికారంలో ఉన్నారు కదా..? మరి అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి దాదాపు 11సార్లు అవకాశం ఇచ్చామని, కానీ చేసింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్లీ ఒక్క అవకాశం అంటూ రావడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీకే వారంటీ లేదని, ఇంకా వాళ్లు ఇచ్చే హామీలకు గ్యారెంటీ ఉంటదా..? ఒకసారి ఆలోచించాలని సూచించారు. వారు అధికారంలో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలో నైనా ఇక్కడ ప్రకటించిన గ్యారెంటీలు అమలు చేస్తున్నారా..? చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకున్నట్లేనని, మీరు ఇప్పుడు వేసే ఓటు ఐదేళ్ల భవిష్యత్ అని చెప్పారు. మీరు కాంగ్రెస్ పాలను చూశారని, బీఆర్ఎస్ పాలన చూశారని, అందులో ఏది బాగుందో ఆలోచించి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు గ్రామాల పరిస్థితి ఎలా ఉండేదో..? ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందాయో చూడాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి మహిళ సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3 వేలు, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం, రైతు బంధు రూ.16వేలకు పెంపు, పింఛన్లు రూ.5 వేలకు పెంచడంతో పాటు, ప్రతి కుంటుబానికి రూ. 5 లక్షల బీమా, రూ 400కే గ్యాస్ సిలిండర్, కేసీఆర్ ఆరోగ్య రక్ష ద్వారా ప్రతీ కుటుంబానికి రూ.15 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. ఇక్కడ ఎంపీపీ శంకరయ్య, జడ్పీటీసీ జలందర్, సర్పంచ్ లక్ష్మీరాజేశం, శంకరవ్వ, పద్మావతి రవీందర్, రవీందర్, పావని నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాండ్లు, పాక్స్ అధ్యక్షులు రాజసమన్ రావు, మాధవరావు, అధికార ప్రతినిధి రవీందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ కమలాకర్ రావు, ఎంపీటీసీ అశోక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అశోక్, నాయకులు మల్లా రెడ్డి ఉన్నారు.

# అప్పుడెట్ల ఉండే జగిత్యాల.. ఇప్పుడెట్ల ఉన్నదో చూడండి



రాయికల్ మండలం అలూర్ గ్రామంలో మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్

- కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- సొంతలాభం చూసుకున్నారే గానీ ప్రజలకు మేలు చేయలేదు
- బీఆర్ఎస్‌తోనే పేదలకు భరోసా
- మీ బిడ్డగా మరోసారి ఆశీర్వదించండి
- జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్ కుమార్
- రాయికల్ మండలంలో ప్రచారం

రాయికల్, నవంబర్ 25: 'ఒకప్పుడు జగిత్యాల ఎట్లుండె.. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇప్పుడెలా అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలి. కాంగ్రెస్ ఏండ్ల కొద్ది పాలించి చేసిందేమీ లేదు. సొంతలాభం చూసుకున్నారే గానీ ప్రజలకు మేలు చేయలేదు అని' జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్ కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్‌తోనే పేద ప్రజలకు భరోసా అని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాయికల్ మండలం రాజనగరం, ఆలూర్, వీరాపూర్, ధర్మాజీపేట, కైరిగూడెం, వస్తాపూర్, దావన్‌పల్లి గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. వీధివీధినా పర్యటిస్తూ ప్రజలను ఓటు అభ్యర్థించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత రైతులకు కరెంటు కష్టాలు లేవని, వ్యవసాయానికి 24 గంటల పాటు ఫ్రీ కరెంట్ ఇస్తున్న ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. ప్రతి గ్రామంలో అర్హులందరికీ పెన్షన్లు అందిస్తామని, ప్రజలు కోరిన సమస్యలను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నుంచి ఆసరా పింఛన్‌ను పెంచుకుందామని, విడతలవారీగా రూ.5016 చేస్తామన్నారు. ఇంటింటికీ కేసీఆర్ బీమా కింద పేదలందరికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా అందజేస్తామన్నారు. ఇంకా రేషన దుకాణాల ద్వారా సన్న బియ్యం అందజేస్తామన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం పేద మహిళలకు నెలకు రూ.3వేల జీవన భృతి అందిస్తామని, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళా సమైక్య సంఘాలకు సొంత భవనాలను నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికార దాహంతో అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. ఫేక్ హామీలు ఇస్తూ, అబద్ధాలు చెబుతున్నారని, నమ్మితే మోసపోతారని చెప్పారు. 'నేను మీ బిడ్డను. ఎల్లవేళలా మీ వెంటే ఉంటా. కష్టమొస్తే ఆదుకుంటా. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి. జగిత్యాల నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని' విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ సభ్యురాలు జాదవ అశ్విని, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్. సర్పంచులు, భాగ్యలక్ష్మి, యమున, స్నేహలత,చంద్రకళ, లక్ష్మీ, సుమలత, చిన్న మల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు సురేందర్ రెడ్డి, నాగరాజు, పద్మ, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, ఉపసర్పంచులు ఉన్నారు.

# కోరుట్లలో బీజేపీ ఖాళీ

- కమలం కకావికలం
- ఇటీవలే ఇద్దరు కౌన్సిలర్లు రాజీనామా
- తాజాగా కోరుట్ల బీజేపీ పట్టణాధ్యక్షుడు దాసరి రాజశేఖర్
- ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



కోరుట్ల టౌన్ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, టౌన్ అధ్యక్షుడితో పాటు దాదాపు 200 మంది నాయకులు పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడం బీజేపీని కుదుపేసింది. కోరుట్లలో బీజేపీ ఖాళీ అయిన పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీకి చెందిన అత్యంత కీలకమైన నాయకులు, కోరుట్ల టౌన్ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునిత, 12వ వార్డు కౌన్సిలర్ అలేఖ్య, ఆమె భర్త మురళీ శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అంతేకాకుండా, బీజేవైఎం మెట్‌పల్లి టౌన్ అధ్యక్షుడు పసునూరి ఆనంద్, యూసఫ్ నగర్ మాజీ సర్పంచులు శంకర్, రాజు, వార్డు సభ్యుడు జాఫర్‌తో పాటు వారి వెంట దాదాపు 200 మంది యువకులు కూడా చేరారు.

### కమలం పార్టీ కకావికలం..

కోరుట్ల బీజేపీ కకావికలమైంది. నియోజకవర్గంలో ఆ పార్టీకి ముఖ్యమైన నాయకులు పార్టీని వీడడంతో గట్టి షాక్ తగులుతున్నది. కోరుట్ల, మెట్‌పల్లి టౌన్లతో పాటు పరిసర గ్రామాల్లో రాజకీయంగా పట్టున్న ఈ నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం వల్ల కోరుట్లలో బీజేపీ ఖాళీ అయినట్లయ్యిందని అంటున్నారు. ఇటీవలే కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్లు ఇద్దరు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా కోరుట్ల బీజేపీ పట్టణాధ్యక్షుడు దాసరి రాజశేఖర్ శనివారం పార్టీకి, అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ఝలక్ ఇచ్చారు. కోరుట్ల బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అనుసరిస్తున్న ఒంటెద్దుపోకడకు నిరసనగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు కనీస మర్యాద కరువైందని అందుకే పార్టీకి, పదవికి రాజీనామా చేశానని చెప్పారు. శనివారం నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అయితే బీజేపీలో క్రియాశీకలంగా ఉన్న ఈ నాయకుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారు పార్టీ మారడం బీఆర్ఎస్‌కు కలిసొచ్చే అంశం.



పార్టీలో చేరిన కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్ అలేఖ్య, ఆమె భర్త మురళితో ఎమ్మెల్సీ కవిత

# మరోసారి అవకాశమివ్వండి

పెంబట్ల-కోనాపూర్‌లో మ్యానిఫెస్టో అందజేస్తున్న మాజీ మంత్రి రాజేశం గౌడ్



మాజీ మంత్రి, జగిత్యాల ఎన్నికల ఇన్‌చార్జి రాజేశం గౌడ్

సారంగాపూర్, నవంబర్ 25: మరోసారి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి, జగిత్యాల నియోజక వర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాజేశం గౌడ్ అన్నారు. శనివారం పెంబట్ల, కోనాపూర్ తదితర గ్రామాల్లో రాజేశంగౌడ్, జిల్లా లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ ఆయా గ్రామాల్లో కుల సంఘాల పెద్దలు, నాయకులను కలుస్తూ సంజయ్ కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమర్థత ఉన్న నాయకుడిని గెలిపిస్తేనే జగిత్యాల మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నదన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి ఎళ్లవేలలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు, కులసంఘాల పెద్దలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.